క్లుప్తంగా

పేద విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలి

పోరుమామిళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ప్రభుత్వమే ఉచితంగా అందజేయాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (ఆర్‌ఎస్‌వైఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభించి నెలన్నర గడుస్తున్నా ఇంతవరకు పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. జిల్లా నాయకుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

బి.కోడూరు : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంఈఓ సునీల్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ మాబురెడ్డిలు తెలిపారు. మండలంలోని కాసానగరం కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్‌ఆర్‌హెచ్‌ఆర్‌సీ ట్రస్టు, బయోడైవర్సిటీ బోర్డు సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఎస్‌ఆర్‌హెచ్‌ఆర్‌సి సంస్థ సభ్యులు గంట రామ్మోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని టీఓపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా అభిలాష్

పోరుమామిళ్ల : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వైఎస్సార్ కడప జిల్లా కన్వీనర్‌గా అభిలాష్‌ను ఎన్నుకున్నారు. ఈనెల 13 నుంచి 16 వరకు రాజమండ్రిలో జరిగిన ప్రాంత అభ్యాస వర్గ సమావేశాల్లో ఎన్నిక చేసినట్టు అభిలాష్ పేర్కొన్నారు. పోరుమామిళ్ల కార్యదర్శిగా, బద్వేలు కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేసిన అభిలాష్‌కు జిల్లా బాధ్యతలు అప్పగించడంపై ఆ సంఘ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మడూరులో గ్రామ సభ

చాపాడు : మండల పరిధిలోని మడూరు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సభ జరుగుతుందని, సచివాలయ పరిధిలోని ప్రజలు సమస్యలను సభ దృష్టికి తీసుకురావచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

ఆర్డీఓకు వినతి

బద్వేలు అర్బన్ : స్థానిక కమలమ్మ కాలనీలోని అంబేడ్కర్ భవన్ చుట్టూ రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ప్రహరీగోడ నిర్మాణానికి అడ్డంకులు లేకుండా చూడాలని సోమవారం దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్డీఓ ఆకుల వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ కార్యాలయ ఏఓను పంపి పూర్తిస్థాయిలో విచారించి అడ్డంకులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు దళిత, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ, దళిత ప్రజా సంఘాల నాయకులు జకరయ్య, కేశవ, పిచ్చయ్య, వెంకటరమణ, శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు

అట్లూరు : అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.విశ్వంత్, డీపీఎంఓ సి.లక్ష్మినారాయణల ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అలాగే సచివాలయం వారీగా లెప్రసీ అనుమానితులను గుర్తించి వారికి పరీక్షలు చేశారు. 20 మందికి పరీక్షలు చేయగా ఒకరికి మల్టిబేసిల్లీ (ఎంబీ)గా నమోదు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి.మురళీకృష్ణ, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ సమన్వయకర్తగా వెంకట సుబ్బారెడ్డి

చాపాడు : మండల స్వచ్ఛ భారత్ సమన్వయకర్తగా ద్వార్శల వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు. గతంలో సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించిన వారిని జగన్ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మండల సమన్వయకర్తగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి నియామక పత్రాన్ని అందజేశారు.

వసతులు కల్పించాలని ధర్నా

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ అమృతా నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృతా నగర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని.. లబ్ధిదారులు ఇళ్లకు పునాదులు వేసుకున్నారు. అక్కడ వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి



లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



అట్లూరు: ధృవపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టరు సుధ

ఖాజీపేట : ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కోరారు. సోమవారం పత్తూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష సభ నిర్వహించారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ సంక్షేమ పథకం కావాలన్న మండల కేంద్రంలోని కారాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు సురక్ష పథకం ద్వారా గ్రామానికే అధికారులు వచ్చి మీసమస్యలు తెలుసుకొని అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రుసుము తీసుకోకుండా ఉచింతంగా అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, సర్పంచ్ బుట్టా రేణుక, ఎంపీటీసీ రాముడు, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు పీ రాఘవరెడ్డి, సచివాలయాల కనీనర్ గోపాల్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సుబ్బారావు, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, పత్తూరు నాయకులు మునలయ్య, వెంకటయ్య, బేరి భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పాలన అంతా మీ గ్రామాల్లోనే జరిగేలా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నాగపట్నం, పత్తూరు, హరిజనవాడ, ధాంఖాన్‌పల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, పుల్లూరు మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, అప్పనపల్లె మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, చెన్నముక్కపల్లె సర్పంచ్ బుజ్జి తోపాటు నాయకులు పాల్గొన్నారు.

ప్రజల బాగోగులే ప్రభుత్వం లక్ష్యం

అట్లూరు : ప్రజల బాగోగులే లక్ష్యంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టరు సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని మాడపూరు సచివాలయ ఆవరణంలో సోమవారం తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబంలోని వారికి 11 రకాల పత్రాలలో అవసరమైన పత్రాలను గుర్తించి ఈ కార్యక్రమం ద్వారా వారికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం మంజూరైన ధృవ పత్రాలను అందజేశారు. సర్పంచులు సగిలి శ్యామలమ్మ, ఆర్‌వి సుబ్బారెడ్డి, కొల్లు సుబ్బారెడ్డి, ఏఓ రామకృష్ణయ్య, ఎంఈఓ విలియం రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయ, ఏఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

బద్వేలు అర్బన్ : జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డిలు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయనగర్ సచివాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా 98 శాతం మందికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. సాంకేతిక కారణాల వలన పథకాలందని 2 శాతం మందికి సైతం పథకాలు అందలేదనే మాట ఉండకూడదన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, కోఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు సాంబశివారెడ్డి, గుబ్బా వెంకటసుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఆర్‌ఐ ఖాజాహుస్సేన్, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

కలసపాడు : జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం జరుగుతుందని మండల స్పెషలాఫీసర్ మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మహానందిపల్లె సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వే ద్వారా 99 మందిని గుర్తించి 96 మందికి వివిధ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, పురుషోత్తంరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ దేవసాని శ్రీనివాసులరెడ్డి, పులివీరారెడ్డి, సింగరయ్య, ఎంపీడీఓ మహబూబ్‌బీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ ప్రయోజనం

పోరుమామిళ్ల : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఉన్నత ఆశయంతో అమలు చేస్తున్న జగనన్న సురక్షతో అందరికీ ప్రయోజనం చేకూరుతున్నదని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా పేర్కొన్నారు. మండలంలోని నాగలకుంట్లలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని 112 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 చెన్ను రాజశేఖర్, సచివాలయాల మండల కన్వీనర్ రమణారెడ్డి, ఎంపీటీసీ రవికుమార్, సర్పంచ్ రోశయ్య, తహసీల్దారు గంగయ్య, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ పథకాలు

రాజుపాళెం : అర్హులైన పేదలందరికీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ అన్నారు. మండలంలోని పర్లపాడులోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ సయ్యదున్నీసా మాట్లాడుతూ వివిధ రకాల సర్టిఫికెట్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారని, వారందరికి పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం ఎంపీటీసీ సభ్యురాలు బుక్కసముద్రం ప్రవల్లిక, వైఎస్సార్‌సీపీ నాయకుడు కశిరెడ్డి మధుసుదన్ రెడ్డి, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథ రెడ్డి, ఏపీఎం గంగయ్య, ఏపీఎం జయరాజ్, పశువైద్యాధికారి నారాయణరెడ్డి, ఈఓపీఆర్డీ ఆలీఖాన్‌లు లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెలవలి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

దువ్వూరు : సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రం దువ్వూరు సచివాలయం-1లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందించి పథకాలను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, సర్పంచ్ దంద్రు చెండ్రాయుడు, ఎంపీటీసీ రహమతున్నీసా , ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీరారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మీ కుటుంబానికి మేలు జరిగింటే ఓటేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటే వైఎస్సార్‌సీపీకి ఓట్లేసి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం 33, 34, 46 వార్డు సచివాలయాల పరిధిలో కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగన్ పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో ఇచ్చిన వాగ్దానాలన తూ.చ. తప్పకుండా అమలు చేశామని తెలిపారు.

డ్వాక్రా సంఘాల రుణం ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రూ.160 కోట్లు ఉండగా వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటికే రూ.120 కోట్లు మహిళలకు చెల్లించారన్నారు. మహిళల రుణానికి సంబంధించి వడ్డీ ప్రభుత్వమే చెల్లించిందన్నారు. వృద్ధాప్య పింఛన్ గతంలో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండేదని జగన్ ప్రభుత్వంలో ఒకటో తేదీనే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష ద్వారా 850 మందికి సర్టిఫికెట్లు అందించారు. కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు సహకారంతో రూ.4 కోట్లతో గాంధీ పార్కు పూర్తి చేశామని, ఈనెల 20న ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మెప్మా బజార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మెప్మా బజార్‌ను ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మెప్మా పీడీ సురేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ నాగేషారెడ్డి, కౌన్సిలర్ కమాల్ బాషా, కోఆప్షన్ మెంబర్ మల్లికార్జున యాదవ్, మెప్మా అధికారి కెజియా జాస్లిన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, పోసా భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి రూ. 3.50 లక్షలు మంజూరు

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని దొరసానిపల్లెకు చెందిన చేనేత కార్మికుడు పల్లా చౌడయ్య తెలిపారు. సోమవారం పల్లా చౌడయ్యకు ఎమ్మెల్యే రాచమల్లు ఎల్‌ఓసీ లెటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా పల్లా చౌడయ్య మాట్లాడుతూ తన మోకాలి ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృషి చేసి రూ.3.50 లక్షలు ఎల్‌ఓసీ మంజూరు చేయించారన్నారు. వాస్తవానికి తనకు తొలిమారు మోకాలి ఆపరేషన్ జరిగిందని, అయితే ఆపరేషన్ ఫెయిల్ కావడంతో మళ్లీ ఆపరేషన్ చేయించుకునేందుకు తనకు ఆర్థిక స్తోమత లేదన్నారు. ఈ సమస్యను స్వయంగా ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన వారం రోజుల్లోనే ప్రభుత్వంతో మాట్లాడి రూ.3.50 లక్షలు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ మునివర, ఉపసర్పంచ్ లక్ష్మినారాయణరెడ్డి, పల్లా చౌడయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

అట్లూరు : మండల పరిధిలోని కమలకూరు, మణ్యంవారిపల్లె గ్రామాల మార్గమధ్యలో సోమవారం ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు సూరాయపల్లెకు చెందిన ఈశ్వర్ (50) తన ద్విచక్ర వాహనంపై కమలకూరుకు బయలుదేరాడు. కమలకూరు నుంచి ద్విచక్ర వాహనంపై పెంచలయ్య, పోలయ్య అనే ఇరువురు మణ్యంవారిపల్లెకు బయలుదేరారు. ఇరువురు మణ్యంవారిపల్లె - కమలకూరు మార్గమధ్యలో ఉన్న మలుపు వద్ద ఢీకొనడంతో ఈశ్వర్, పెంచలయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

సంక్షేమం.. పార్టీలకతీతం

అట్లూరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని మణ్యంవారిపల్లి, ఎస్సీ కాలనీ గ్రామాలలో సోమవారం గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. మణ్యం మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు నవరత్నాలలో భాగంగా అందిన సంక్షేమ పథకాల వివరాలను తెలియపరిచారు. సంక్షేమ పథకాలను అర్హులకు నేరుగా ఇంటికి వెళ్లి అందజేయడం దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని ఘనత అని ఆమె ఆయా కుటుంబాలకు వివరించారు. అందరికీ సంక్షేమ పథకాలు, పేదరికం నిర్మూలన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చిత్తశుద్ధితో పథకాలు అందిస్తున్న పార్టీ దేశంలో వైఎస్సార్‌సీపీ ఒకటేనని పేర్కొన్నారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి చేసుకోవాల్సిన ఆవశ్యకత మన అందరిపై ఉందన్నారు. డీఎల్‌డీఏ చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మణ్యం వెంకటరెడ్డి, రాజోలు సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనరు ఈశ్వరరెడ్డి, రెడ్డెయ్య, గంగిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మహేశ్వర రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నాగసుబ్బారెడ్డి, ఉప్పతి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అక్రమ నిర్మాణం

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం జగనన్న కాలనీలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇంటి నిర్మాణానికి ఎవరు అనుమతి ఇచ్చారని గ్రామస్తులు ప్రశ్నించగా స్థానికంగా ఉన్న కొందరు ఇళ్లు వేసుకోమన్నారని సమాధానం చెప్పడంతో గ్రామస్తులు నిర్మాణాన్ని ఆపాలంటూ వారించారు. అధికారులు వెంటనే స్పందించి, విచారించి ఆక్రమణ జరగకుండా చర్య తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళా మార్ట్ ప్రారంభానికి సిద్ధం

బద్వేలు అర్బన్ : మహిళలందరిని వ్యాపారవేత్తలుగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంతో పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 19న జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల చేతులమీదుగా దీనిని ప్రారంభించనున్నారు. బద్వేలు, గోపవరం మండలాలలోని వెయ్యి స్వయం సహాయక సంఘాలు ఉండగా అందులోని 10 వేల మంది సభ్యులు రూ.30 లక్షల పెట్టుబడితో దీనిని ఏర్పాటు చేశారు. నాణ్యమైన సరుకులను బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు చేయూత మహిళా మార్ట్‌లో విక్రయించనున్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక రాచమల్లు వారి రాజన్న భోజనం ప్రాంగణంలో మంగళవారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఈనెల 20వ తేదీన హోం మంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రూ.151.38 కోట్లతో అమృత్ నీటి పథకం, రూ.1.50 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్, రూ.4.60 కోట్లతో నిర్మించిన మున్సిపల్ గాంధీ పార్కులను ప్రారంభించడంతోపాటు రూ.1.83 కోట్లతో జగనన్న స్మార్ట్ స్ట్రీట్ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. రాచమల్లు వారి రాజన్న భోజనం వారు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



వ్యవసాయం గురించి వివరిస్తున్న శాస్త్రవేత్తలు

బ్రహ్మంగారిమఠం : భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని వనిపెంటలోని కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో సోమవారం బ్రహ్మంగారిమఠంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీవిద్యారాణి మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ 95వ ఆవిర్భావ దినోత్సవం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవీకే కార్యక్రమాల గురించి వివరించారు. రైతులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.హర్షిత, డాక్టర్ ఎస్.ఫిరోజ్ హుస్సేన్ మాట్లాడుతూ నూతన వంగడాల ప్రత్యేకతలను, బయో ఫర్టిలైజర్, వివిధ రకాలు క్రిమి సంహారక మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ, డాక్టర్ లావణ్య, ఏకలవ్య ఫౌండేషన్ మేనేజర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

సేవకు సలాం



వలంటీర్ కాదు ఆత్మ బంధువు



కరోనా సమయంలో వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న వలంటీర్ అహమ్మద్ హుస్సేన్ (ఫైల్)

వలంటీర్‌గా విధులు నిర్వహించడమే కాదు, తన పరిధిలోని వారికి చేదోడు వాదోడుగా ఉంటూ సేవలు అందిస్తున్నాడు మైదుకూరులోని కొత్తకొట్టాలు వలంటీర్ అహమ్మద్ హుస్సేన్. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే తన పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయడమే కాకుండా వారికి ఏదైనా అవసరం ఏర్పడినప్పుడు తానున్నానంటూ సహాయం అందిస్తుంటాడు. కరోనా సమయంలో తన జీతం డబ్బులతో పలు కుటుంబాలకు బియ్యం అందజేశాడు. పింఛన్‌దారుల్లో ఎవరైనా దూర ప్రాంతాల్లో చికిత్స తీసుకుంటున్నా, వారి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తుంటాడు. ఇటీవలే హుసేన్‌బీ అనే మహిళ చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి ఆ కుటుంబ అభిమానాన్ని పొందాడు.

– మైదుకూరు

వలంటీర్ మేలు మరిచిపోను



నాకు కొంత కాలం కిందట కాలు విరిగింది. చికిత్స చేయించుకున్నా బాగుపడలేదు. నాకు వికలాంగ పింఛన్ వస్తోంది. మా వలంటీర్ అహమ్మద్ హుస్సేన్ ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తుంటాడు. అలాగే నాకు ఏదైనా అవసరమైన వస్తువులు తెచ్చి పెట్టమన్నా విసుక్కోకుండా అహమ్మద్ హుస్సేన్ తెచ్చిస్తుంటాడు. అతని మేలు మర్చిపోలేనిది.

– మహమ్మద్ హనీఫ్, కొత్తకొట్టాలు, మైదుకూరు

కష్టకాలంలోనూ అండగా..



హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మహాలక్షుమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీరు లక్ష్మీదేవి

మండలంలోని పిట్టిగుంట గ్రామానికి చెందిన మహాలక్షుమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో రెండు నెలలుగా చికిత్స పొందుతోంది. దీంతో ఆమె పింఛను తీసుకోలేకపోయింది. ఈ నెల పింఛను తీసుకోకపోతే ఆమె పింఛను రద్దవుతుందని వలంటీరు లక్ష్మీదేవి సొంత ఖర్చుతో హైదరాబాద్ వెళ్లింది. ఆస్పత్రిలో మహాలక్షుమ్మకు పింఛను అందజేసింది. వలంటీరు తీసుకున్న చొరవపై గ్రామస్తులు అభినందించారు.

– కాశినాయన

హైదరాబాద్‌కు వచ్చి పింఛను ఇచ్చింది



అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరా. అక్కడ చికిత్స పొందుతూ రెండు నెలలు దాటింది. ఇక మూడో నెల కూడా పింఛను కోసం సొంతూరికి రాలేని పరిస్థితి నాది. పింఛను తీసుకోకుంటే రద్దవుతుందని మా వలంటీరు లక్ష్మీదేవి హైదరాబాద్‌కు వచ్చి నాకు పింఛను ఇచ్చింది. మూడు నెలల పింఛను ఒకేసారి ఇవ్వడంతో ఆ సొమ్ము ఆసుపత్రి ఖర్చులకు ఉపయోగపడింది. వలంటీరుకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– మహాలక్షుమ్మ, లబ్ధిదారురాలు, పిట్టిగుంట, కాశినాయన మండలం

యాచకుడికి కొత్త జీవితం అందించి..



వెంకటరెడ్డికి పింఛను పుస్తకాన్ని అందజేస్తున్న వలంటీరు స్వాతిశ్రీ

ఈ చిత్రంలో కనిపిస్తున్న వెంగళ వెంకటరెడ్డి 15 సంవత్సరాలుగా కలసపాడులో ఉంటూ యాచక వృత్తిలో సాగుతూ జీవిస్తున్నాడు. ఇతడి స్వగ్రామం వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల సమీప ఇటుకరాళ్ళపల్లె గ్రామం. వెంకటరెడ్డికి ఎలాంటి జీవనాధారం లేకపోవడంతో అతడికి ఏదైనా దారి చూపాలని స్థానిక వలంటీరు వి.స్వాతిశ్రీ భావించింది. ముందుగా రేషన్‌కార్డు ఇప్పించింది. ఆ తర్వాత ఈకేవైసీ చేయించి పింఛను ఇప్పించింది. వెంకటరెడ్డి ప్రస్తుతం కలసపాడు వినాయకనగర్‌లోని వినాయక గుడిలో పూజారిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. వెంకటరెడ్డికి పింఛను ఇప్పించినందుకు స్వాతిశ్రీ 2021లో ప్రభుత్వం నుంచి సేవావజ్ర కింద రూ.20 వేలు బహుమతి అందుకుంది.

– కలసపాడు

వలంటీరు సాయంతో నా జీవితమే మారింది



నేను 15 సంవత్సరాల క్రితం కలసపాడుకు వచ్చాను. యాచకవృత్తిలో ఉంటూ వచ్చాను. నా పరిస్థితి గమనించిన వలంటీరు స్వాతిశ్రీ పింఛను, రేషన్‌కార్డు ఇప్పించింది. దీంతో నా జీవితమే మారిపోయింది. పింఛను ద్వారా ప్రభుత్వ సాయం అందుతోంది. ప్రస్తుతం ఓ గుడిలో పూజారిగా ఉంటున్నా. నాకు కొత్త జీవితాన్ని ఇచ్చిన వలంటీరుకు రుణపడి ఉంటాను.

– వెంగళవెంకటరెడ్డి, కలసపాడు

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేశ్వరి దేవి ఆలయంలో పూజా కార్యక్రమంలో భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాం నగర్‌లోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో సోమవారం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 2500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మోతుకూరు వెంకట సుబ్బయ్య, బొలిశెట్టి మల్లికార్జున, సానా వెంకటసుబ్బన్న, బొలిశెట్టి శ్రీరాములు, గురప్ప, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

■ వసంతపేటలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో సోమవారం రాత్రి కలశాలను ఊరేగించారు. ఏపీ నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి, తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

■ స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో, వసంతపేటలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో, ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజ మహాచౌడేశ్వరిదేవి ఆలయంలో, వినాయకనగర్ , వెంకటేశ్వర్లపేట , ఆర్ట్స్‌కళాశాల రోడ్డులోని చౌడేశ్వరిదేవి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు.

చౌడేశ్వరికి చీర, సారె సమర్పించిన దేవాంగులు

చౌడేశ్వరిదేవి జయంతి సందర్భంగా సోమవారం ది ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమం సంఘం, శ్రీరామలింగ చౌడేశ్వరి ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో దేవాంగ కులస్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందచేసి సత్కరించారు. 3 వేల మందికిపైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం, కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, కోశాధికారి కాటం రామకృష్ణ, ఉపాధ్యక్షులు లక్ష్మినారాయణ, పోసా వేణుగోపాల్, ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పోసా కృష్ణవాసులు, సెక్రటరీ గిద్దలూరు శ్రీనివాసులు, కోశాధికారి కాటం వీరప్రసాద్, డైరెక్టర్ గంగా జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి పూజలు

రాజుపాళెం : మండలంలోని ఏరువపాలెం, తొండలదిన్నె, కొర్రపాడు, పగిడాల గ్రామాల్లో చౌడేశ్వరిదేవి ఆలయాల్లో గ్రామస్తులు పూజలు చేశారు. అనంతరం ఏరువపాలెంలోని చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద చీరెలను వేలం పాట వేయగా రూ.15,680 వచ్చినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

మిషన్ ఇంద్ర ధనస్సుపై అవగాహన

దువ్వూరు : దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ సమీర ఆధ్వర్యంలో మిషన్ ఇంద్ర ధనస్సుపై అవగాహన కార్యక్రమం న్విహించారు. ఆమె మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో ప్రజలకు వ్యాధి నిరోధక టీకాల గురించి వివరించాలని తెలిపారు. గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి చిన్న పిల్లలను గుర్తించి వారికి ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.